www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శుక్రవారం, 22 జూలై 2022 | ఎడిటర్: గోనుకొండ పృథ్విరాజు | సంపుటి - 07, సంచిక-108 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



# నూతన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- దేశ చరిత్రలో సరికొత్త అధ్యాయం
- రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము
- విపక్ష అభ్యర్థి యశ్వంత్ సిన్హాపై జయకేతనం
- క్రాస్ ఓటింగ్‌తో అనూహ్యంగా భారీ ఆధిక్యం
- 25న 15వ రాష్ట్రపతిగా ప్రమాణానికి ఏర్పాట్లు
- ప్రమాణం చేయించనున్న చీఫ్ జస్టిస్ ఎన్‌వి రమణ
- ముర్ము నివాసానికి వెళ్లి అభినందించిన మోడీ, నడ్డా



**న్యూఢిల్లీ, జూలై 21 (సమ సమాజం):** భారతదేశ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. దేశ అత్యున్నత పదవిని తొలిసారి ఓ ఆదివాసీ మహిళ అధిరోహించనుంది. భారత ప్రథమ పౌరురాలిగా ద్రౌపది ముర్ము ఎన్నిక య్యారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్ము ఘన విజయం సాధించారు. ప్రతిభా పాటిల్ తరవాత రెండో మహిళగా అత్యున్నత పీఠం అధిరోహించబోతున్నారు. అయితే తొలిసారిగా ఓ గిరిజన మహిళగా ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించబోతున్నారు. అనూహ్యంగా ఎన్‌డిఎ మద్దతుదారులను మించి ఓటేయడంతో భారత రాష్ట్రపతి ఎన్నికల్లో ద్రౌపది ముర్ముభారీ విజయం సాధించారు. భారత రాష్ట్రపతి పదవిని చేపట్టిన తొలి గిరిజన మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ఓ గిరిజన మహిళను, అదీ అస్సలు ఇంతవరకు అవకాశం లేని తెగనుంచి ద్రౌపది ముర్మను బరిలోకి దింపి బిజెపి దార్శనికతను చాటింది. దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించిన రెండో మహిళగా ముర్ము నిలిచారు. ఎన్డీఏ అభ్యర్థిగా రాష్ట్రపతి ఎన్నికల్లో బరిలో దిగిన ఆమె విజయ దుందుభి మోగించారు. సగానికి పైగా ఓట్లు సాధించిన ముర్ము ప్రత్యర్థి యశ్వంత్ సిన్హాపై భారీ మెజార్టీతో గెలుపొందారు. సగానికి పైగా ఓట్లు సాధించారు. ఆమె రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఎన్‌డిఎ శ్రేణులు సర్వత్రా ఆనందం వ్యక్తం చేశారు. సంబరాలు చేసుకున్నారు. ముర్ము విజయం సాధించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆమెతో భేటీ అయి, 2

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు

- డెంగీ నమోదవుతున్న జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వాసుపత్రుల్లోనే చికిత్సలు అందించాలి
- బూస్టర్ డోస్ ప్రక్రియను వేగవంతం చేయాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి హరీష్ రావు సూచనలు



**హైదరాబాద్, జూలై 21 (సమ సమాజం):** వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. డెంగీ కేసులు నమోదవుతున్న జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. అలాగే పలు రాష్టాల్లో్ కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో బూస్టర్ డోస్ పంపిణీ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బూస్టర్ డోస్ చాలా ముఖ్యమని, అర్హులందరికీ వేసేలా రాష్ట్ర వ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే నెల రోజులు ఎంతో కీలకమని చెప్పారు. ముఖ్యంగా వరద ప్రభావిత ప్రాంతాలు, ట్రైబల్ ఏరియాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల సంస్థ నుంచి గురువారం ఆయన అన్ని జిల్లాల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సీజనల్ వ్యాధులు, బూస్టర్ డోస్, సీసెక్షన్లు, ఎన్‌సీడీ స్క్రీనింగ్, తదితర అంశాలపై సమీక్షించారు. లక్షణాలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి, వెంటనే చికిత్స అందించాలని ఆదేశించారు. ఒకవైపు అవగాహన పెంచడం, మరో వైపు సత్వర చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ప్రైవేటు దవాఖానలకు వెళ్లి జేబులు ఖాళీ చేసుకోకుండా, ప్రభుత్వ దవాఖానల్లో ఉన్న వైద్య సేవలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. చికిత్స, రోగ నిర్ధారణ పరీక్షల సేవల గురించి అవగాహన 3

# ఇడి విచారణకు హాజరైన సోనియా

- వెంటవచ్చిన రాహుల్,ప్ ప్రియాంకలు
- కాంగ్రెస్ శ్రేణుల ఆందోళనతో భారీ భద్రత
- మూడుగంటలపాటు విచారించిన ఇడి అధికారులు
- సోమవారం మరోమారు విచారణకు రావాలని ఆదేశాలు





**న్యూఢిల్లీ, జూలై 21 (సమ సమాజం):** నేషనల్ హెరాల్డ్ అవినీతి కేసులో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు సుమారు మూడు గంటల పాటు ప్రశ్నించారు. తదుపరి విచారణకు ఆమె సోమవారం మరోసారి రావాల్సి ఉంటుందని ఈడీ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు సోనియా ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. సోనియా వెంట ఆమె తనయుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రా ఈడీ కార్యాలయానికి వచ్చారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టంలోని క్రిమినల్ సెక్షన్ల కింద సోనియా వాంగ్మూలాలను ఈడీ అధికారులు నమోదు చేశారు. నేషనల్ హెరాల్డ్ పత్రికలో సోనియా, రాహుల్‌ల షేర్లు, ఆర్థిక లావాదేవీలు, వీరి పాత్రలకు సంబంధించి ప్రశ్నించారు. మరోవైపు సోనియా ఈడీ అధికారుల ఎదుట హాజరైనందుకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించింది. రాహుల్ గాంధీ ఈడీ ఎదుట హాజరైనప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించింది. 3

## సోనియాకు మద్దతుగా నిలవాలి

- జెండాలు,ఎజెండాలు పక్కన పెట్టాలి
- తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా
- ఇడి కేసులు పెట్టి వేధిస్తున్నారు
- ఇడి కార్యాలయంముందు కాంగ్రెస్ ఆందోళన
- మోడీ తీరుపై మండిపడ్డ రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 21 (సమ సమాజం):** తెలంగాణ ఇచ్చిన సోనియాకు జెండాలు,ఎజెండాలకు మద్దతుగా అంతా నిలవాలని పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీలకుఅతీతంగా నిలవాలన్నారు. బిజెపి ఇడిని అడ్డం పెట్టుకుని త్యాగాల కుటుంబాన్ని వేధిస్తోందని అన్నారు. సోనియాపై ఈడీ కేసు నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో... హైదరాబాద్‌లోనూ హస్తం నేతలు ధర్నాకు దిగారు. నెక్లెస్‌రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వరకు కాంగ్రెస్ నేతలు ర్యాలీగా బయల్దేరారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి, పలువురు నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీని ఈడీ పేరిట కేంద్ర ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని తెలంగాణ కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. కేంద్ర సర్కార్ హస్తం పార్టీపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్రజాస్వామిక పద్ధతిలో ఈడీ.. సోనియా గాంధీని విచారి స్తోందని విమర్శించారు. ఈ విషయమంతా ప్రజలు గమనిస్తున్నారని.. త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నల్లదుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. కొందరు నేతలు కార్యకర్తలు నల్ల రంగు బెలూన్లు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. దారి పొడవునా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యకర్తలు ర్యాలీ కొనసాగించారు. ర్యాలీ సందర్భంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇందిరా 3

## కెసిర్‌కు బిజెపి ఫీవర్ పట్టుకుంది

- ప్రజల కష్టాలుతీరాలంటే కెసిఆర్ దిగాల్సిందే
- పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబానికేనా
- కెసిఆర్‌పైనా ఇడి విచారణ తప్పదు
- ఇడి కేసులకు హాజరయితే ఆందోళనలుచేస్తారా
- ప్రజల గోస.. బీజేపీ భరోసా యాత్రలో
- మండిపడ్డ బండి సంజయ్

3



## దేశానికి విఘాతంగా మారిన మోడీ విధానాలు

- తెలంగాణ అభివృద్దిని అడ్డుకుంటుటున్న కేంద్రం
- శ్మశానాలకు కూడా జివిస్టీ వేయడం దారుణం
- జివిస్టీతో నిత్యావసరాలు కొనసలేని స్థితిలో ప్రజలు
- ఉపాధిహామీని మెచ్చుకుంటూనే తనిఖీలు చేయడం బాధాకరం
- సిబిఐ,ఇడిలను అడ్డంపెట్టి ఫెడరల్ వ్యవస్థకు తూట్లు
- మండిపడ్డ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

3



## పిఆర్‌వో మహేశ్‌ను అభినందించిన కెటిఆర్

### పిహెచ్‌డితో పాటు బంగారు పతకం రావడంపై అభినందనలు

**హైదరాబాద్, జూలై 21 (సమ సమాజం):** పీహెచ్‌డీలో భాగంగా జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ విభాగంలో పరిశోధన చేసి బంగారు పతకం పొందిన తన పీఆర్వో మాణిక్య మహేశ్‌ను మంత్రి కేటీఆర్ అభినందించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా 'గ్రామీణ అభివృద్ధిలో కమ్యూనికేషన్ వ్యూహాల మూల్యాంకనం' అనే అంశంపై ప్రొఫెసర్ వీ సత్తిరెడ్డి ఆధ్వర్యంలో పరిశోధన చేశారు. ఈ పరిశోధన గ్రంథానికి డాక్టరేట్‌తో పాటు బంగారు పతకాన్ని తెలుగు యూనివర్సిటీ ప్రదానం చేసింది. పరిశోధనకు బుధవారం రవీంద్రభారతిలో జరిగిన తెలుగు విశ్వవిద్యాలయ 15వ స్నాతకోత్సవంలో భాగంగా గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని యూనివర్సిటీ ప్రదానం చేసింది. ఈ నేపథ్యంలో తన పీఆర్వో మహేశ్‌ను ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ అభినందించారు.

# సంపాదకీయం

## మహిళా బిల్లును అటకెక్కించడంలో మోడీ విజయం !

సంపూర్ణ మెజార్టీ ఉన్నా మహిళా బిల్లుకు మాత్రం మోక్షం దక్కడంలేదు. దీనిని గట్టెక్కించచడంలో కనీసం ప్రస్తావన కూడా జరగలేదు. మోడీ అధికారంలోకి వచ్చి ఏనిమిదేళ్లు పూర్తయ్యాయి. ఎన్నోమార్లు పార్లమెంట్ సమావేశాలు ముగగిసాయి. తాజాగా వర్షాకాల సమావేశాలు జరుగుతున్నాయి. ఏ సమస్యపైనా చిత్తశుద్ది ప్రదర్శించని ప్రభుత్వం..ఈ మహిళా బిల్లును ప్రస్తావిస్తుందని అనుకోవడం భ్రమే కాగలదు. మహిళా రాష్ట్రపతి ద్రౌపది ముర్మను ఎన్నుకున్నామని ఘనంగా చెప్పుకుంటున్న వేళ మహిళా బిల్లుపై మోడీ ఏ సందర్భంలోనూ.. ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ ఎనిమిదేళ్లలో ఆయన చిత్తశుద్దిని పరిశీలిపోయింది. మోడీ ఒక్కరికి చిత్తశుద్ది ఉంటే మహిళా బిల్లు ఎప్పుడో గట్టెక్కేది. అయితే ప్రస్తుత సమావేశాలు జరుగుతన్న తీరు చూస్తుంటే ఏ సమస్యను కూడా చర్చించే ధోరణిలో ప్రభుత్వం లేదు. జిఎస్టీ, ఆర్థిక ద్రవ్యోల్బణం వంటి వాటినే చర్చించడానికి సిద్దంగా ఉన్నట్ఉలగా కనిపించడం లేదు. సమస్యలను చర్చిస్తామని మంత్రి పీయూష్ గోయల్ బయట ప్రకటనచేయడం తప్ప సభలో ప్రకటనచేయడం లేదు. ఈ క్రమంలో ప్రజల సమస్యలకు లేదా ప్రధాన అంశాలకు పార్లమెంటులో చర్చకు వస్తాయన్న ఆశ లేకుండా పోయింది. ఇన్నేళ్లుగా దీనిపై మాటమాత్రంగా అయినా మాట్లాడకుండా నెట్టుకొస్తున్న ప్రధాని మోడీ ఇక ఏ మాత్రం జాప్యం చేయకుండా ఈ సమావేశాల్లోనే బిల్లు పెట్టి పాస్ చేయించే బాధ్యత తీసుకోవడం ద్వారా భారతీయ మహిళలకు భరోసా కల్పించాలి. భారత రాజకీయాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నా గత రెండున్నర దశాబ్దాలుగా మహిళా బిల్లు మాత్రం గట్టెక్కలేకపోతోంది. లోక్‌సభలో సంపూర్ణ మెజార్టీ ఉన్నా మోడీ ప్రభుత్వం దీనిని ముందుకు తీసుకుని వచ్చే ప్రయత్నం చేయడం లేదు. అన్నింటికి మించి ప్రధాన ప్రతిపక్షం అయిన కాంగ్రెస్ పార్టీ బేషరతుగా బిల్లుకు మద్దతు ఇస్తామని ప్రకటించింది. దీంతో ఇప్పుడు చిత్తశుద్దితో బిల్లును గట్టెక్కించే బాధ్యత మోడీపైనే ఉంది. గతంలో లాగా కారాణలు లేదా సాకులు చూపే సమయమిది కాదు. అలా చేస్తే ఇక బిజెపిని పూర్తిగా నమ్మరు. గతంలో కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఉన్న సోనియాగాంధీ మహిళా బిల్లును గట్టెక్కించాలని ప్రధాని మోడీకి లేఖరాశారు. అయితే మోడీ మనసులో మహిళా బిల్లుకు సంబంధిం చిన ఆలోచనలను వెల్లడి కావడం లేదు. అనేక సదస్సులు, సమావేశాల్లో ప్రధాని మోడీ మహిళల ఔన్నత్యం గురించి మాట్లాడుతున్నా పార్లమెంటులో మాత్రం బిల్లు రావడం లేదు. దీంతో గత నాలుగేళ్లుగా ఇది కోల్డ్ స్టోరేజిని దాటి రావడం లేదు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వివక్షలపై స్పందించడం లేదు. త్వరలోనే మహిళల రిజర్వేషన్లపై ముందుకు సాగుతామన్న ఆకాంక్ష అలాగే ఉండిపోయింది. పాలనలో వారికి భాగస్వామ్యం కల్పించకుండా వారిని అణగదొక్కే కుట్రల్లో బిజెపి కూడా ముందే ఉంది. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎందుకనో రాజకీయంగా ముందుకు సాకుండా అణగదొక్కుతున్నారు. ఇలా వారిని అణచి వేయడం వల్ల 50శాతం జనాభా ఆకాంక్షలను కాలరాస్తున్న వారు అవుతున్నారు. మహిళా సాధికారతతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాలన సాగాలి. చట్టసభల్లో మూడోవంతు రిజర్వేషన్లు ఎవరి దయాధర్మంగానో కాకుండా హుక్కుగా, సగౌరవంగా లభించాల్సి ఉంది. మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించినప్పుడే సామాజిక ప్రగతి సాధ్యపడు తుంది. ఏకాభిప్రాయ సాధన, ఉపకోటా పేరిట ఇంతకాలం రాజకీయం చేస్తూ వచ్చారు. మహిళల హక్కుల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోకుండా చూడాలి. ప్రజాస్వామ్యంలో కేవలం అధికారపక్షమే కాదు ప్రతిపక్షాలకూ, ప్రజలందరికీ పాత్ర ఉంటుంది. ఇది గమనించి అందరూ ముందుకు సాగాలి.మహిళల గొప్పతనాన్ని భారతీయ మహిళల ఆదర్శాలను ప్రముఖంగా ప్రస్తావిస్తున్న ప్రధాని మోడీ ఈ సారయినా మహిళా బిల్లుకు మోక్షం కలిగిస్తారా లేదా అన్నది చూడాలి. ముద్రా పథకంతో దేశంలో మహిళల స్థితిగతులు మారిపోతున్నట్లు చెప్పడం కాకుండా ..వారికి అధికారం కూడా అప్పగించాలి. మహిళలు సాధిస్తున్న విజయాలు, వారికిస్తున్న ప్రోత్సాహకాలను ఏకరువు పెట్టడం పక్కన పెట్టి చిత్తశుద్ది చాటాలి. సమాన అవకాశాలు, సముచిత గౌరవం, సాధికారిత స్వప్నం అమల్లోకి వస్తేనే మహిళా లోకానికి సాకార మయ్యేది. అవసరమైన చర్యలు తీసుకోవడానికి బదులుగా మొక్కుబడి చర్యలకు పాలకవర్గాలు పరిమితం కావడమే ఈ పరిస్థితికి కారణం. వారికి చట్టసభల్లో సముచిత గౌరవం దక్కాలి. వారికి ÷లిరిజర్వేషన్లు రావాలి. అప్పుడే తమ సమస్యలపై మహిళలు గళమెత్తే అవకాశం ఉంటుంది. మహిళా సమానత్వమే సమాజానికి హితం చెబుతున్న పాలకులు సమాన గౌరవం ఇచ్చి చట్టసభల్లో ప్రవేశించేలా చేయడంలో మాత్రం విఫలం అవుతున్నారు. మహిళల్లో స్ఫూర్తిని నింపడమే గాకుండా, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి వారిని మనతో సమానంగా ముందుకు తీసుకుని వెళ్లడంలో పురుష సమాజం విఫలమయ్యిందనడంలో సదేహం లేదు. ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మహిళా బిల్లుకు తొలి ప్రధాన్య అంశంగా గుర్తించాలి. లోక్‌సభలో తగిన బలం ఉంది కనుక ప్రధాని మోడీయే ఇందుకు చొరవ తీసుకుని మహిళా బిల్లును గట్టెక్కించి భారతీయ మహిళలకు రాఖీపూర్ణిమ కానుక ఇవ్వాలి. అన్నిపక్షాలు దాదాపుగా ఏకాభిప్రాయంతో ఉన్నందున మోడీ ముందుకు వచ్చి చిత్తశుద్దిని ప్రదర్శించాలి. ఓ మంచి కార్యం చేశామన్న భరోసా కల్పించగలగాలి. మహిళా బిల్లును ఆమోదించక పోవడం బిజెపి ఘోర వైఫల్యంగానే చూడాలి. ఎన్నో ఆదర్శాలు వల్లించిన మోడీ సర్కార్ ఈ విసయంలో ఘోర వైపల్యాన్ని ప్రదర్శించారు. భారత రాజకీయాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నా గత రెండు దశాబ్దాలుగా మహిళా బిల్లు మాత్రం గట్టెక్కలేకపోతోంది. ఎన్ని చట్టాలు చేసినా మృగాళ్ల మదోన్మాదం, కుటుంబ సభ్యుల కామ దాహం, అధికారులు, సహోద్యోగుల వికృత చేష్టలు వాళ్ల పాలిట శాపాలవుతున్నాయి. దీనికి తోడు మత ఛాందసవాదం మహిళా సమానత్వానికి మరింత హానికరంగా తయారైంది. భ్రూణ హత్యల కారణంగా దేశంలో క్షీణిస్తున్న అమ్మాయిల నిష్పత్తి ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఏటా జరుపు కుంటున్నా, మహిళలకు సమానహక్కులు, వారికి ప్రాతినిధ్యం వంటి విషయాల్లో ఇంకా మనం వెనకబడే ఉన్నాం. వారిని ముందుకు వెళ్లకుండా వెన్నక్కి నెట్టేస్తూనే ఉన్నాం. మహిళా బిల్లుతో రాజకీయాల్లో రాణిస్తే భారత సమాజం తీరు కూడా మారుతుందనడంలో సందేహం లేదు. బిజెపి ఆదర్శాలు వల్లించేకన్నా మహిళా బిల్లును త్వరగా గట్టెక్కించే ప్రయత్నం చేసి తన చిత్తశుద్దిని చాటుకోవాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# గోదావరి వరదలతో ఖమ్మం జిల్లాలో లక్ష ఎకరాల మునక

- పోలవరం ప్రాజెక్టుతో జిల్లాలోని ఏడు మండలాలు ముంపు
- కాఫర్ డ్యాం నిర్మాణంతో భద్రాద్రి రామయ్యకూ ముంపే
- పోలవరంపై పునరాఓలచనచేయాలన్న మంత్రి పువ్వాడ

**ఖమ్మం, జూలై 21 (సమ సమాజం):** ఈ ఏడాది గోదావరి వరద వల్లనే ఖమ్మం జిల్లాలో లక్షల ఎకరాల ముంపునకు గురైనట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. పోలవరం ప్రాజెక్టుతో ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలు ముంపునకు గురవుతాయని తెలిపారు. ఖమ్మం జిల్లాకేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. పోలవరం కాఫర్ డ్యాం నిర్మాణంతో భద్రాద్రి రామయ్య కూడా మునిగి పోతాడని పువ్వాడ అజయ్ తెలిపారు. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు వరద తగ్గకపోవడంతో ముంపు ప్రాంతాలు మరింత పెరిగే అవకాశముందని తేలిందన్నారు. ముందుగా ప్రతిపాదించినట్లు పోలవరం ప్రాజెక్టులో 36 లక్షల క్యూసెక్కులు నీటి నిలువ సామర్థ్యం ఉంటుందని భావించినట్లు వెల్లడించారు. కానీ ఇప్పుడు కాఫర్ డ్యాం కూడా కాంక్రీట్‌తో నిర్మించేలా ఏపీ ప్రభుత్వం ఆలోచన చేస్తోందని పేర్కొన్నారు. పోలవరం వల్ల మరింత ముప్పు ఏర్పడే ప్రమాదముంది. భద్రాద్రి రామయ్య ఆలయం కూడా మునిగిపోయే అవకాశముంది. కేంద్రం, ఏపీ ప్రభుత్వాలు మాకు సహకరించాలి. పోలవరంపై కేంద్రం మరోసారి అధ్యయనం చేయాలి. సాధ్యమైనంత త్వరగా ఐదు గ్రామాలు తెలంగాణలో కలపాలి. రెండు రాష్ట్రాలకు ఇష్ట దేవుడైన భద్రాచలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పువ్వాడ అన్నారు. పోలవరం కాఫర్ డ్యాం నిర్మాణంతో మరో పదహారు లక్షల క్యూసెక్కులు నీరు నిల్వ ఉంటే భద్రాద్రి రామయ్య కూడా మునిగిపోతాడని పువ్వాడ అజయ్ తెలిపారు. కేంద్రం పోలవరం ప్రాజెక్టుపై అధ్యయనం చేయాలని ఖమ్మం జిల్లా ప్రతినిధులుగా డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. సాధ్యమైనంత తొందరగా పార్లమెంట్‌లో ఆర్డినెన్స్ తీసుకొచ్చి భద్రాద్రి చుట్టుపక్కల ఉన్న ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. కరకట్ట నిర్మాణం ద్వారా తెలుగువారి ఇష్ట దైవమైన రామయ్యను కాపాడుకోవచ్చని తెలిపారు. దీనికి కేంద్రం, ఏపీ ప్రభుత్వం సహకరించాలని మంత్రి పువ్వాడ అజయ్ విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే సమైక్య పాలనలో ఒక్క పంటకే సాగునీరు అందక పంటలు ఎండి పోయేవి. అలాంటి పరిస్థితి నుంచి స్వరాష్ట్రంలో రెండు పంటలకు పుష్కలంగా సాగునీటిని అందించే విధంగా వ్యవసాయ రంగంపై విజన్ కలిగిన ఏకైక సీఎం కేసీఆర్ అని రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు జలాశయం నుంచి స్థానిక ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత సకాలంలో వర్షాలు పడి పంటలు పడుతున్నాయని అన్నారు. నాటి పాలకుల హయాంలో సాగర్‌కు నీరు రావాలంటే ఎగువన అన్ని ప్రాజక్టులు నిండి ఆంధ్రాకు నీరు వదిలిన తరువాత తెలంగాణాకు నీరు విడదల చేసేవారన్నారు. ఖమ్మం జిల్లాలో 2.5 లక్షల ఎకరాలకు సాగర్ జలాలు అందిస్తామని, రైతులు నీటిని వృథా చేయకుండా పంటలకు వినియోగించుకోవాలన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా ఉన్నందున నెల రోజులు ముందుగానే నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అధికారులు రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, సీఈ శకంర్ నాయక్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా రైతుబంధు సమితి కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఊటీని ముంచెత్తిన భారీ వర్షం

**చెన్నై, జూలై 21 (సమ సమాజం):** నీలగిరి జిల్లాలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉపరితల ద్రోణి కారణంగా నీలగిరి, కోవై సహా ఐదు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీవర్షానికి ఊటీలోని పలు రోడ్లపై వరద నీరు ప్రవహించింది. దీంతో రాష్ట్ర విపత్తుల నివారణ బృందానికి చెందిన 170 మంది సభ్యులు ఊటీలో విధుల్లో అప్రమత్తంగా ఉన్నారు.

# నూతన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

(మొదటి పేజీ తరువాయి..)

అభినందించారు. రాష్ట్రపతిగా విజయం సాధించిడంపై ఆమెను అభినందించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, భాజపా చీఫ్ జేపీ నడ్డా,పలువురు కేంద్రమంత్రులు సహా పలువురు నేతలు కూడా ముర్మును కలిసి అభినందనలు తెలిపారు. సోమవారం ప్రమాణస్వీకారం జరగనున్న నేపథ్యంలో జేపీ నడ్డా పార్టీ నేతలు, భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. ఇదిలావుంటే 25న భారతప్రధాన న్యయామూర్తి జస్టిస్ ఎన్వి రమణ ఆమెతో ప్రమాణం చేయిస్తారు. ఇకపోతే ద్రౌపది ముర్ముకు బీజేపీ, ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలతో పాటు బీజేడీ, వైఎస్సార్ కాంగ్రెస్ సహా 44 పార్టీలు మద్దతిచ్చాయి. దీంతో ఆమె ఎలక్టోరల్ కాలేజ్‌లో అవసరమైన మెజార్టీకి మించి ఓట్లు సాధించారు. 63శాతం ఓట్లతో విజయ కేతనం ఎగరవేశారు. ఈ నెల 25న దేశ 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము బాధ్యతలు చేయనున్నారు. మూడో రౌండు కౌంటింగ్ పూర్తయ్యే సరికి ద్రౌపది ముర్ము 50శాతానికి పైగా ఓట్లు సాధించారు. దీంతో ఆమె విజయం లాంఛనమైంది. ఎన్డీఏ అభ్యర్థిగా బరిలో దిగిన ముర్ము ప్రతి రౌండ్ లోనూ ప్రత్యర్థి యశ్వంత్ సిన్హాపై స్పష్టమైన ఆధిక్యం సాధించారు. మూడో రౌండు పూర్తయ్యే సరికి ద్రౌపది ముర్ముకు 5,77,777 ఓట్లురాగా.. యశ్వంత్ సిన్హాకు 2,61,062 ఓట్లు మాత్రమే వచ్చాయి. జులై 25న ద్రౌపది ముర్ము రాష్ట్రపతి పీఠం అధిరోహించనున్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థిగా ద్రౌపది ముర్ము, విపక్షాల అభ్యర్థిగా యశ్వంత్ సిన్హా బరిలో దిగారు. ఈ నెల 18న ఓటింగ్ నిర్వహించగా.. ఈ రోజు ఉదయం 11 గంటలకు పార్లమెంటు హౌస్‌లో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. తొలుత ఎంపీల ఓట్లు లెక్కించగా.. తొలి రౌండ్‌లోనే ద్రౌపది ముర్ము భారీ ఆధిక్యంతో దూసుకుపోయారు. మొత్తం 763 మంది ఎంపీలు ఓటు వేయగా వారిలో 15 మంది ఓట్లు చెల్లలేదు. మిగిలిన 748 ఓట్లలో ఎన్డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్ముకు 540 ఓట్లు వచ్చాయని వాటి విలువ 3,78,000 అని రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోడీ ప్రకటించారు. ఇక విపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు 208 ఓట్లు రాగా వాటి విలువ 1,45,600గా లెక్కించారు. అనంతరం ఆల్ఫాబెటికల్ ఆర్డర్ లో రాష్ట్రాల వారీగా ఎమ్మెల్యేల ఓట్లు లెక్కించగా రెండో రౌండ్ లోనూ ద్రౌపది ముర్ము దూసుకుపోయారు. సెకండ్ రౌండ్ లో 10 రాష్ట్రాలకు చెందిన 1138 మంది ఎమ్మెల్యేల ఓట్లు చెల్లుబాటు కాగా.. వాటిలో ద్రౌపది ముర్ముకు 1,05,299 విలువైన 809 ఓట్లు పోలైనట్లు రాజ్యసభ సెక్రటరీ పీసీ మోడీ తెలిపారు. సెకండ్ రౌండ్ లో విపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు కేవలం 329 ఓట్లు మాత్రమే దక్కాయి. ఆయనకు వచ్చిన ఓట్ల విలువ 44,276. ఎంపీలు, 10 రాష్ట్రాల ఎమ్మెల్యేలతో కలుపుకొని చెల్లుబాటైన 1,886 ఓట్ల విలువ 6,73,175 కాగా.. వాటిలో 1,349 ఓట్లు ద్రౌపది ముర్ము ఖాతాలో పడ్డాయి. వాటి విలువ 4,83,299. ఇక సెకండ్ రౌండ్ ముగిసే సరికి యశ్వంత్ సిన్హాకు 1,89,876 విలువైన 537 ఓట్లు మాత్రమే పడ్డాయి. మూడో రౌండులో కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల ఎమ్మెల్యేల ఓట్లు లెక్కించారు. 1,333 ఓట్లు చెల్లుబాటు కాగా.. వాటిలో ద్రౌపది ముర్ముకు 812 , విపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు 521 ఓట్లు వచ్చాయి.

# కోమటిరెడ్డి బ్రదర్స్ ఆధిపత్యంపై పోరాటం

- పావులు కదుపుతున్న అధికార టీఆర్ఎస్
- రంగంలోకి జగదీశ్వర్, గుత్తాలు ?



**నల్గొండ, జూలై 21 (సమ సమాజం):** ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోటగా ఉన్న నల్లగొండ జిల్లాలో నేడు అధికార తెరాస, ప్రతిపక్ష కాంగ్రెస్‌లు పట్టు కోసం పావులు కదుపుతున్నాయి. రెండు పార్టీలు ఆధిపత్య పోరాటం చేస్తున్నాయి. దాదాపు రెండు దశాబ్దాలుగా ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ కాంగ్రెస్‌లో సీనియర్ నేతగా ముద్రపడిన కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఢీ కొట్టేందుకు తెరాస పావులు కదుపుతోంది. మరోవైపు వచ్చే ఎన్నికల్లో సిఎం కెసిఆర్ నల్లగొండ జిల్లా నుంచి పోటీ చేస్తారన్నప్రచారం సాగుతోంది. ఇక్కడ పట్టుకోసం ఆయన ఈ వ్యూహం పన్నినట్లు తెలుస్తోంది. ప్రధానంగా కోమటిరెడ్డి బ్రదర్స్‌ను ఎదగకుండా చేయాలన్న వ్యూహంతో సాగుతున్నారు. రాష్ట్రమంతా అధికార పార్టీ హవా కొనసాగినా ఇక్కడ కాంగ్రెస్ మూలాలు బలంగా ఉండటంతో... ఎలాగైనా ఇక్కడ తెరాసను బలోపేతం చేయాలని మంత్రి జగదీష్‌రెడ్డి మూడున్నరేళ్లుగా ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుత్సాహంలో ఉన్న కాంగ్రెస్‌లో జవసత్వాలు నింపాలనే ఉద్దేశంతో కోమటిరెడ్డి శ్రేణులను తనదైన శైలిలో ముందుకు తీసుకుని వెళుతున్నారు. కాంగ్రెస్‌ను బలోపేతం చేయడం మాటెలా ఉన్నా కోమటిరెడ్డి బ్రదర్స్ ఎక్కడ ఉంటే అక్కడ ప్రజలు అన్నరీతిలో సాగుతున్నారు. స్థానిక ఎంపిగా తనకు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే హక్కు ఉందని.. దానిని అధికార పార్టీ కాలరాస్తోందని... ప్రభుత్వం, ఆపార్టీ నాయకులు రౌడీయిజంతో నల్గొండ ప్రజల్లో భయభ్రాంతులను సృష్టిస్తున్నారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రోజులు దగ్గర పడ్డాయని కోమటిరెడ్డి ఇటీవలి ఘటనల సందర్భంగా తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న జిల్లాల్లో ఒక్కటైన ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ అధిపత్యం నేటికీ కొనసాగుతోంది. 2015 డిసెంబరులో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ రాష్ట్రమంతా కారు హవా సాగినా.. ఇక్కడ మాత్రం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గెలిచి ముఖ్యమంత్రికి సవాలు విసిరారు. అయితే తెరాస ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా నల్గొండ ఎంపీ గుత్తాతో పాటు కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, దేవరకొండ సీపీఎం ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌లు తెరాసలో చేరడంతో అధికార పార్టీ ఆధిపత్యం చలాయించింది. దీనిని ఎదుర్కొవడానికి ఆరు నెలలుగా కోమటిరెడ్డి బ్రదర్స్ మిర్యాలగూడ, మునుగోడు ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేస్తామని పలు వేదికల్లో పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తెస్తామని పదేపదే వెంకటరెడ్డి ప్రకటిస్తున్నారు. మరోవైపు కోమటిరెడ్డి బ్రదర్స్ బిజెపిలో చేరుతారని కొంతకాలం నుంచి సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా ఇదే ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఇక్కడ బలంగా ఉన్న పార్టీని దెబ్బకొట్టడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో నల్గొండ నుంచి పోటీ చేస్తారనే ప్రచారం ప్రస్తుతం వినిపిస్తోంది. రెండు దశాబ్దాల పాటు కోమటిరెడ్డి ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా అభివృద్ధి విషయంలో అడుగులు పడటం లేదని భావిస్తూ వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించాలనే ప్రణాళికలతో ఆయన ముందుకు వెళుతున్నారు.సుఖేందర్‌రెడ్డి టిఆర్ఎస్‌లో చేరాక అధికార పార్టీ బలోపేతం అయ్యింది. కార్యకర్తలను ఇంతకుముందెన్నడూ లేని ఉత్సాహం తెచ్చిపెడుతోంది. దీంతో పలు కార్యక్రమాలను ఇరువురు నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఈ మధ్య కాలంలో ఘర్షణల సంఖ్య పెరిగింది. కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవడం ఒకరి లక్ష్యమైతే..., రెండు దశాబ్దాలుగా వేళ్లూనుకుపోయినా పార్టీ బలాన్ని తగ్గించి నల్గొండను తెరాసకు కంచుకోటగా మార్చే లక్ష్యంతో మంత్రి, స్థానిక నేతలు ముందుకువెళుతుండటంతో రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచిచూడాలి. ఏదిఏమైనా కొన్ని రోజులుగా మాటలకే పరిమితమైన రెండుపార్టీల నాయకులు, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఘర్షణలకు దిగడంతో రాజకీయ వేడి అందుకుంది.

# కాళేశ్వరానికి జాతీయహోదా అర్హత లేదు

- ప్రాజెక్ట్‌కు ఇన్వెస్ట్‌మెంట్ క్లీయరెన్స్ లేనేలేదు
- అందుకే జాతీయహోదా స్కీంలో దానిని చేర్చలే
- ఎంపి ఉత్తమ్ ప్రశ్నకు కేంద్రం లిఖితపూర్వక జవాబు



**న్యూఢిల్లీ, జూలై 21 (సమ సమాజం):** కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించలేమని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేసీఆర్ కోరినట్లు తెలిపిన కేంద్ర గిరిజన సంక్షేమం,జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు అన్నారు. కాళేశ్వరానికి ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ లేదని, అందుకే కాళేశ్వరానికి జాతీయ హోదా కల్పించలేదని పేర్కొన్నారు. జాతీయ ప్రాజెక్టు స్కీంలోకి కాళేశ్వరాన్ని చేర్చే అర్హతలేదని వెల్లడించారు. మొత్తంగా జాతీయ హోదాకు సంబంధించి కాళేశ్వరం ప్రాజెక్టుకు విషయంలో కేంద్రం క్లారిటీ ఇచ్చింది. ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని తేల్చిచెప్పింది. కాళేశ్వరానికి ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ లేదని.. ఈ నేపథ్యంలో జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్రం స్పష్టం చేసింది. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రం ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని సీఎం కేసీఆర్ 2016, 2018లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. అయితే ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. పర్మిషన్లు ఉంటేనే కాళేశ్వర ప్రాజెక్టును హైపవర్ స్టీరింగ్ కమిటీ పరిశీలిస్తుంది. హైపవర్ కమిటీ అనుమతిస్తేనే జాతీయ హోదా ఇచ్చే అవకాశం ఉంటుంది. కాళేశ్వరానికి ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ లేదు. జాతీయ ప్రాజెక్టుల జాబితాలో చేర్చే అర్హత దానికి లేదని కేంద్ర జలశక్తి శాఖ సహాయకమంత్రి బిశ్వేశ్వర్ తుడు స్పష్టం చేశారు. జాతీయ హోదా ప్రాజెక్టు పథకంలో ఏ ప్రాజెక్టునైనా చేర్చాలంటే కేంద్ర జలసంఘం అధ్యయనం తప్పనిసరి కేంద్రం చెబుతోంది. ఆ తర్వాత ప్రాజెక్ట్ సలహా కమిటీ ఆమోదం పొందాలని పేర్కొంది. పెట్టుబడుల అనుమతి కేంద్రం నుంచి తీసుకోవాలని తెలిపింది. అయితే తెలంగాణ ప్రభుత్వం ఎటువంటి అనుమతులు తీసుకోలేదని కేంద్రం అంటోంది. లోక్‌సభలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిప్రశ్నకు.. కేంద్ర సహాయ మంత్రి బిశ్వేశ్వర్ లిఖితపూర్వక సమాధానిచ్చారు. కాళేశ్వరరానికి జాతీయ హోదా లభిస్తే.. ప్రాజెక్టు నిర్మాణంలో అనేక ప్రయోజనాలు సిద్ధిస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది.

# జమ్మికుంట అభివృద్ధికి 42 కోట్లు కేటాయింపు

- ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ 8 ఏళ్లుగా ఒక్కపనీచేయలే
- కలెక్టర్ కర్ణన్‌తో కలసి పర్యటించిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి

**కరీంనగర్, జూలై 21 (సమ సమాజం):** జమ్మికుంట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.42కోట్లు కేటాయించామని ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన జమ్మికుంటలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ వరద కాలువను, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కౌశిక్ రెడ్డి.. జమ్మికుంట పట్టణంలోని సమస్యలను స్వయంగా పరిశీలించామన్నారు. ఇంతకు ముందు జమ్మికుంటను దుమ్ముకుంట అనే వారని.. ఇక్కడ మంత్రిగా, శాసన సభ్యుడిగా ఎనిమిదేళ్లు పని చేసిన ఈటల రాజేందర్ ఒక్క సమస్య పరిష్కరించలేదన్నారు. హౌసింగ్ బోర్డు మునుగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతామని.. జమ్మికుంటకు మరో రూ.4కోట్లు నిధులు తీసుకు వస్తే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేసిన సమయంలోనూ సమస్య పరిష్కరించలేదన్నారు. వైద్యులు, సిబ్బంది కొరతను మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లామని.. త్వరలోనే ఇక్కడ దాక్టర్లను నియమించి 24గంటల వైద్య సౌకర్యం కల్పిస్తామని హామి ఇచ్చారు.

# యాదాద్రి జిల్లాలో మంచులక్ష్మి పాఠశాలల దత్తత

- కలెక్టర్‌తో సమావేశమై చర్చించిన సినీనటి

**యాదాద్రి భువనగిరి, జూలై 21 (సమ సమాజం):** జిల్లాలోని మూడు పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు సినీ నటి మంచు లక్ష్మి తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ తో సమావేశం అయ్యారు. సంబంధిత శాఖ అధికారులతో చర్చించిన తర్వాత ఆలేరు మండలం పటేల్ గూడెంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు మంచు లక్ష్మి తెలిపారు. పాఠశాలను అభివృద్ధి చేసి పిల్లలకు సరైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ప్రతి విద్యార్థికి సరైన విద్య అందాలనేదే లక్ష్యం అన్నారు. చదువు అంటే ప్రభుత్వ స్కూళ్లే గుర్తుకు రావాలన్నారు. రాష్ట్రంలోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసానికై ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి సారించేలా చేయడమే సంకల్పం అని మంచు లక్ష్మి పేర్కొన్నారు. తొలుత యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు సినీనటి మంచు లక్ష్మి. జిల్లాలో మూడు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకునేందుకు వచ్చిన ఆమె స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. శ్రావణమాసంలో ఆలయంలో నిర్వహించే 'కోటి కుంకుమార్చన' టికెట్ ను ఆమె కొనుగోలు చేశారు.

# అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు కరోనా పాజిటివ్

చికిత్స పొందుతున్నారని ప్రకటించిన వైట్‌హౌజ్

**వాషింగ్టన్, జూలై 21 (సమ సమాజం):** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు కోవిడ్-19 సోకింది. ఆయనకు స్వల్పంగా కోవిడ్-19 పాజిటివ్ లక్షణాలు ఉన్నట్లు గురువారం వైట్ హౌస్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆయన ఫైజర్ ఇంక్‌కు చెందిన పాక్స్‌లోవిడ్ చికిత్స పొందుతున్నట్లు వివరించింది. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరైన్ జీన్-పియర్రే విడుదల చేసిన ప్రకటనలో, జో బైడెన్ (79)కి స్వల్పంగా కోవిడ్-19 పాజిటివ్ లక్షణాలు కనిపించినట్లు తెలిపారు. ఆయన చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఆయన వైట్ హౌస్‌లో ఐసొలేషన్‌లో ఉంటారని, అయితే తన విధులను కొనసాగిస్తారని చెప్పారు. వైట్ హౌస్ సిబ్బందితో టెలిఫోన్ ద్వారా మాట్లాడుతున్నారన్నారు. ఆయన పాల్గొనవలసిన సమావేశాల్లో తన నివాసం నుంచి ఫోన్, జూమ్ ద్వారా పాల్గొంటారన్నారు. జో బైడెన్ ఇటీవల సౌదీ అరేబియా, ఇజ్రాయెల్‌లలో పర్యటించారు. బుధవారం ఆయన మసాచుసెట్స్‌లో పర్యటించారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ అమలు గురించి మాట్లాడారు. గన్ సేఫ్టీ, నేరాలపై పెన్సిల్వేనియాలో గురువారం ప్రసంగించవలసి ఉంది. దిలావుండగా, జో బైడెన్‌కు పూర్తిగా టీకాకరణ జరిగింది. అంతేకాకుండా రెండు బూస్టర్ డోసులు కూడా తీసుకున్నారు. అయినప్పటికీ ఆయనకు స్వల్పంగా కోవిడ్ లక్షణాలు కనిపిస్తున్నాయి. ఆయన పూర్తిగా కోలుకునే వరకు ఆయన ఆరోగ్య పరిస్థితిని రోజూ తెలియజేస్తామని వైట్ హౌస్ ప్రకటన పేర్కొంది. జో బైడెన్ సతీమణి జిల్‌కు కోవిడ్ నెగెటివ్ రిపోర్టు వచ్చిందని తెలిపింది.

# వినాయక విగ్రహాలపై హైకోర్టు కీలక ఆదేశాలు

- పివోపి విగ్రహాలపై నిషేధం విధించలేదన్న కోర్టు
- పిఓపి విగ్రహాల నిమజ్జనంపై ఆంక్షలు

**హైదరాబాద్, జూలై 21 (సమ సమాజం):** వినాయక విగ్రహాల తయారీ, నిమజ్జనంపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల తయారీపై నిషేధం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను హుస్సేన్ సాగర్ లో నిమజ్జనం చేయవద్దని కోర్టు ఆదేశాలిచ్చింది. పీవోపీ విగ్రహాలు జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసే నీటి గుంటల్లోనే నిమజ్జనం చేయాలని సూచించింది. పీవోపీ విగ్రహాల నిషేధంపై గతంలో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలు జారీ చేసింది. పీసీబీ మార్గదర్శకాలను సవాల్ చేస్తూ విగ్రహ తయారీదారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపింది. పీవోపీ విగ్రహాలు నిషేధిస్తూ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి జీవో ఇవ్వలేదని హైకోర్టు పేర్కొంది. పీవోపీ విగ్రహాల నిషేధంపై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని న్యాయస్థానం తెలిపింది. విగ్రహాల ఎత్తు తగ్గించేలా ఉత్తర్వులు ఇవ్వాలన్న ప్రభుత్వ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది.

శుక్రవారం, 22. 07. 2022
www.aksharavelugu.com
సమ సమాజం



# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు

(మొదటి పేజీ తరువాయి..) కల్పించాలన్నారు. మున్సిపల్, పంచాయతీ శాఖలు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో పారిశుద్ధ్యం పట్ల అవగాహన పెంచాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. నీటి నిల్వ లేకుండా చూడడం, ఫాగింగ్, డ్రై డే డ్రై డే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. తద్వారా దోమలు, ఈగల నియంత్రణ జరిగేలా చూడాలని సూచించారు. వర్షాలు, వరదల సమయంలో జిల్లా వైద్యాధికారులు సమన్వయంతో పని చేశారని, స్టాఫ్ నర్సులు, ఆశా కార్యకర్తలు, ఇతర సిబ్బంది అందరూ మంచి సేవలు అందించారని అభినందించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఇంకా బాగా పని చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో కుక్క, పాముకాటు మందులు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. సబ్ సెంటర్ల వారీగా జరుగుతున్న ఎన్‌సీడీ స్క్రీనింగ్ త్వరగా వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలను మంత్రి అభినందించారు. అలాగే పలు రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో బూస్టర్ డోస్ పంపిణీ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బూస్టర్ డోస్ చాలా ముఖ్యమని, అర్హులందరికీ వేసేలా రాష్ట్ర వ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. జన సాంద్రత ఎక్కువగా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, తదితర జిల్లాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో వాక్సినేషన్ వేగంగా నిర్వహించాలని, ప్రజల్లో చైతన్యం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరికీ రెండు, మూడు రోజులు జిల్లాల్లో పర్యటిస్తూ, పురోగతిపై సమీక్షలు నిర్వహించాలని, వచ్చే పది రోజుల్లో వాక్సినేషన్ వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలని డీహెచ్ శ్రీనివాస్‌రావును మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో 2,77,67,000 మందిని అర్హులుగా గుర్తించగా, ఇప్పటి వరకు 12,87,411 మందికి బూస్టర్ వేసినట్లు వివరించారు. రాష్ట్రంలో బూస్టర్ డోస్ పంపిణీకి ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 20 లక్షల పైగా డోసులు నిల్వ ఉన్నాయని చెప్పారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బూస్టర్ డోస్ అందుబాటులో ఉందని, అన్ని జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు, ఇంజినీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీల్లోనూ ప్రత్యేకంగా వాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించాలని డీఎంహెచ్‌వోలను ఆదేశించారు. 040-24651119 నంబర్కు సంప్రదిస్తే.. 100 మంది కంటే ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్న చోట వాక్సినేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తారని, ఈ విషయంపై ప్రచారం కల్పించాలన్నారు. ఆర్బీఎస్‌కే సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి గర్భిణికి నాలుగు ఏఎన్‌సీ చెకప్స్ పక్కాగా జరిగేలా చూడాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఈ విషయంలో మంచి పని తీరు నమోదు చేసిన జోగులాంబ గద్వాల, ఆదిలాబాద్, జనగాం, కుమ్రం భీం, సంగారెడ్డి జిల్లాలను అభినందించారు. సూర్యాపేట, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం ,ములుగు, వికారాబాద్ జిల్లాల్లో పనితీరు తక్షణం మెరుగుపడాలన్నారు. సీ సెక్షన్ల విషయంలో అందరం కలిసి కృషి చేస్తున్న నేపథ్యంలో గణనీయమైన మార్పు వచ్చిందన్నారు. అనవసర సీ సెక్షన్లు తగ్గించడంపై దృష్టి సారించాలన్నారు. ఈ విషయంలో మంచి పని తీరు కనబరుస్తున్న నారాయణపేట్, కుమ్రం భీం ఆసిఫాబాద్, జోగులాంబ గద్వాల, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలను అభినందించారు. కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో సీ సెక్షన్లు బాగా తగ్గించి, సాధారణ ప్రసవాలు పెరిగేలా చూడాలన్నారు. సబ్ సెంటర్‌వారీగా జిల్లా వైద్యాధికారులు సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. పీహెచ్‌సీల్లో డెలివరీలు పెరగాలని, 24 గంటల పీహెచ్‌సీల్లో అన్ని వేళలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ విషయంలో డీఎంహెచ్‌వోలు ప్రత్యేక దృష్టి చూపాలన్నారు. ఎనీమియా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనతో ప్రారంభించిన తెలంగాణ డయాగ్నొస్టిక్స్ దేశానికి రోల్ మోడల్‌గా నిలవాలని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ సేవలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. 24 గంటల్లో పరీక్ష ఫలితాలు వచ్చేలా చేసి, మరుసటి రోజు పేషెంట్ ఆ ఫలితాలను వైద్యులకు చూపించే విధంగా ఉండాలన్నారు. దవాఖానల ప్రదేశంలో ఉండే టీ డయాగ్నొస్టిక్ బాధ్యత ఆయా దవాఖానల సూపరింటెండెంట్ తీసుకోవాలని ఆదేశించారు. మూడు షిఫ్టుల్లో 24 గంటల పాటు సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సేవల్లో మంచి పనితీరు కనబర్చిన మెదక్ జిల్లాను అభినందించారు. మరమ్మతులు, కొత్త బిల్డింగ్ అవసరం ఉన్న పీహెచ్‌సీల వివరాలను టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ, డీఎంహెచ్‌వో మరోసారి సమీక్షించి తుదిప్రతిపాదనలు శుక్రవారంలోగా పంపించాలన్నారు. ఈ సమీక్షలో హెల్త్ సెక్రెటరీ రిజ్వీ, కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేత మహంతి, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ జీ శ్రీనివాసరావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఈ విజయ్ కుమార్, వివిధ ఆరోగ్య కార్యక్రమాల ప్రోగ్రాం ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఈడీ విచారణకు హాజరైన సోనియా

(మొదటి పేజీ తరువాయి..) కాంగ్రెస్ పార్టీకి నేషనల్ హెరాల్డ్ పత్రిక బకాయి ఉన్న 90.25 కోట్ల రూపాయలను వసూలు చేసుకునే హక్కును పొందేందుకు కేవలం 50 లక్షల రూపాయల చెల్లింపుతో యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నేరపూరితమైన కుట్ర పన్నారని ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి గతంలో ఆరోపించారు. సోనియా, రాహుల్ నేషనల్ హెరాల్డ్ ఆస్తుల్ని ఆయాచితంగా పొందారని కూడా స్వామి గతంలో ఆరోపించారు. సోనియా ఆరోగ్య పరిస్థితుల మేరకు సహకారిగా ఉండేందుకు ప్రియాంకకు.. ఈడీ అనుమతి ఇచ్చింది. అయితే విచారణ గది కాకుండా.. మరో గదిలో ఉండేందుకు ప్రియాంకకు అనుమతి ఇచ్చింది.మరోవైపు.. సోనియా గాంధీ ఈడీ విచారణను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్? శ్రేణులు నిరసనలు చేస్తున్నాయి. పార్లమెంట్ వెలుపల, లోపల కూడా సోనియా గాంధీ ప్లకార్డులు పట్టుకొని.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు కాంగ్రెస్‌ఎంపీలు. మరోవైపు.. విపక్షాలు కూడా దీనిపై ఓ ప్రకటన విడుదల చేశాయి. కొన్ని పార్టీల ప్రముఖ నేతలే లక్ష్యంగా ప్రయోగిస్తూ.. దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డాయి. మోదీ ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థలను ఉపయోగించి కక్ష సాధిస్తోంది. ఈడీ ద్వారా ప్రతిపక్షాలపై ప్రతీకారాన్ని తీర్చుకుంటోంది. ఉద్దేశపూర్వకంగానే ప్రతిపక్ష నేతలను వేధింపులకు గురి చేస్తోంది. భాజపా తీరును ఖండిస్తున్నాం. మోదీ సర్కార్ ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సమష్టిగా పోరాటం చేస్తాయని ప్రతిపక్షాలు ప్రకటించారు. సోనియా ఈడీ విచారణ నేపథ్యంలో దిల్లీలో భద్రతను పెంచారు పోలీసులు. ఔరంగజేబ్ మార్గ్, మోతీలాల్ నెహ్రూ మార్గ్, జనపథ్ మార్గ్, అక్బర్ రోడ్‌లను పూర్తిగా మూసివేశారు. కాంగ్రెస్ కార్యకర్తల నిరసనలు చేపడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. కేసులో జూన్ 8నే సోనియా తొలుత విచారణకు హాజరుకావాల్సి ఉంది. జూన్? 2న ఆమెకు కరోనా సోకిన నేపథ్యంలో కొన్నిరోజులు ఐసోలేషన్?లో ఉండి చికిత్స తీసుకున్నారు. అనంతరం.. జూన్ 12న ఆస్పత్రిలో చేరారు. కరోనాతో బాధపడుతున్న కారణంగా విచారణకు హాజరుకాలేనని.. మూడు వారాల గడువు ఇవ్వాలని సోనియా ఈడీని కోరారు. దీంతో జూన్ 23న తమ ముందు విచారణకు హాజరు కావాలని ఈడీ మరోసారి సమన్లు జారీ చేసింది. దీంతో పూర్తిగా కోలుకున్న తర్వాతే హాజరవుతానని ఆమె మరోసారి స్పష్టం చేశారు. సోనియా తనయుడు, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఇదే కేసు విషయంలో.. మొత్తం ఐదు రోజుల్లో సుమారు 55 గంటల పాటు ఈడీ విచారించింది. పార్టీ శ్రేణులు దేశవ్యాప్తంగా అప్పుడు కూడా పెద్దఎత్తున నిరసనలు చేపట్టాయి.

# సోనియాకు మద్దతుగగా నిలవాలి

(మొదటి పేజీ తరువాయి..)



పార్కు వద్ద కాంగ్రెస్ నాయకులు.. నిరసనలకు వెళ్లకుండా పోలీసులు అరెస్టు చేశారు.ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీని ఈడీ పేరిట కేంద్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ మండిపడ్డారు. ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అంజన్ కుమార్ నల్ల దుస్తులు, బెలూన్స్ ప్రదర్శిస్తూ బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి తరలివెళ్లారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సోనియా గాంధీని ఈడీ పేరుతో కేంద్ర ప్రభుత్వం వేధించడాన్ని ఆయన ఖండించారు. ఇలాంటి చర్యలతో కేంద్రం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఏల్పీ నేత భట్టి, మధుయాష్కీ, అంజన్ కుమార్ యాదవ్, పొన్నాల లక్ష్మయ్య,, షబ్బీర్ అలీ నిరసన దీక్షలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నిరసనతో బషీర్ బాగ్ రూట్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. డబ్బు బదలాయింపు లేకున్నా..సోనియా కుటుంబంపై మనీ లాండరింగ్ కేసు నమోదు చేసి కేంద్రం వేధింపులకు గురిచేస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. మానసికంగా ఇబ్బంది పెట్టి.. గాంధీ కుటుంబం దేశం విడిచిపోయేలా చేయాలని కేంద్రం భావిస్తోందని చెప్పారు. సోనియా గాంధీ కుటుంబానికి పార్టీ నాయకులు, శ్రేణులు అండగా ఉంచాయన్నారు. ఈడీ కేసు గురించి క్లుప్తంగా..నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తులను ఆయాచితంగా పొందారని బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇతర స్వాతంత్ర సమరయోధులు కలిసి 1938లో ఈ పత్రికను స్థాపించారు. దీని ప్రచురణ సంస్థ అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్)కు హిందీ, ఉర్దూలలోనూ మరో రెండు పబ్లికేషన్లు ఉన్నాయి. రూ.90 కోట్లకు పైగా అప్పులు పేరుకుపోవడంతో 2008లో ఈ పత్రిక మూతపడింది. ఒక పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ(ఏజేఎల్)ని ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ(యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్-వైఐఎల్) ద్వారా సొంతం చేసుకున్నారని సుబ్రహ్మణ్యస్వామి ఆరోపించారు. ఏజేఎల్ బకాయి పడిన రూ.90.25 కోట్లను వసూలు చేసుకునే హక్కును పొందడానికి వైఐఎల్ ద్వారా రూ.50 లక్షలు చెల్లించి.. కుట్ర, మోసం, నిధుల దుర్వినియోగానికి వీరు పాల్పడ్డారన్నారు.

# వివాదాలు, అవినీతికి దూరంగా ముర్ము ప్రస్థానం

- ప్రజా సంక్షేమం లక్ష్యంగా పదవులకు వన్నె
- గవర్నర్‌గా,మంత్రిగా సమర్థంగా బాధ్యతల నిర్వహణ
- ద్రౌపది గెలుపుతో దేశవ్యాప్తంగా గిరిజనుల ఆనందం



**న్యూఢిల్లీ, జూలై 21 (సమ సమాజం):** ఆదివాసీ మహిళ అద్భుతం సృష్టించింది. భారత ప్రథమ పౌరురాలిగా రాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించనుంది. భారత 15వ రాష్ట్రపతిగా ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్ము గెలుపొందారు. అడవిలో పుట్టి అత్యున్నత పదవికి ఎంపికైన తొలి ఆదివాసీ మహిళగా ద్రౌపది ముర్ము కొత్త చరిత్ర లిఖించారు. గతంలో ప్రతిభా పాటిల్ తొలి మహిళా రాష్ట్రపతిగా రికార్డు సృష్టించగా.. ఇప్పుడు ముర్ము తొలి ఆదివాసీ మహిళా రాష్ట్రపతిగా ఎన్నికై సరికొత్త అధ్యాయానికి తెర తీశారు. 2007 నుంచి 2012 వరు ప్రతిభా పాటిల్ మొదటి మహిళా రాష్ట్రపతిగా సేవలందించగా.. అత్యున్నత పదవి అధిరోహించనున్న ద్రౌపది ముర్ము 2027 వరకు పదవిలో కొనసాగనున్నారు. ఓ గిరిజన మహిళ ఇంతటి అత్యున్నత పీఠం దక్కించుకోవడం భారదేశ చరిత్రలో ఇదే ప్రథమం కావడం విశేషం. ఆమె రాష్ట్రపతిగా విజయం సాధించడంతో దేశవ్యాప్తంగా గరిజనలుఉ ఆనందం వ్యక్తం చేశారు. గిరిజన నృత్యాలతో సంబరాలు చేసుకున్నారు. నిన్న మొన్నటి వరకు కనీసం కరెంటు కూడా లేని కుగ్రామంలో పుట్టిన ద్రౌపది ముర్ము.. ఇప్పుడు దేశ అత్యున్నత పదవి చేపట్టేందుకు సిద్ధమయ్యారు.. ద్రౌపది ముర్ము..క్లర్క్ గా కెరీర్ ప్రారంభించి ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. అయితే.. ఎక్కడ పని చేసినా ఆ పదవికి గౌరవం తీసుకొచ్చారని ఆమె గురించి తెలిసిన వాళ్లు గొప్పగా చెబుతుంటారు. ప్రభుత్వ ఉద్యోగిగా, ప్రజా ప్రతినిధిగా.. అన్ని చోట్లా ముర్ము ప్రజల సంక్షమమే లక్ష్యంగా పని చేశారని అంటుంటారు. తర్వాత గవర్నర్ పదవిలో ఉన్నా... రాజకీయ ఒత్తిళ్లను పట్టించుకోకుండా.. తన, పర అనే బేధాలు లేకుండా పార్టీలకు అతీతంగా పదవికి వన్నె తెచ్చారని చెబుతారు. ఇప్పుడు రాష్ట్రపతి పదవికి ఆమె ఖచ్చితంగా మరింత గౌరవం తీసుకొస్తారని ఆశిస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 11 సంవత్సరాల తరువాత అంటే 1958 జూన్ 20వ తేదీన ఒడిశాలోని మయూర్ భంజ్ జిల్లాలోని బైదాపోసి గ్రామంలో ద్రౌపది ముర్ము జన్మించారు. ఆమె తండ్రి బిరంచి నారాయణ్ తుడు. ఆయన సంతాల్ ఆదివాసి తెగకు చెందినవారు. ఈ తెగ వందల ఏళ్లుగా మనదేశంలో ఉన్నట్టు చరిత్ర చెబుతోంది. అంతేకాదు.. సంతాల్ తెగ వీరులను భారతదేశ మొదటి స్వాతంత్య్ర పోరాట యోధులుగా కూడా పిలుస్తారు. అలాంటి తెగ నుంచి వచ్చిన ద్రౌపది ముర్ము ఇప్పుడు దేశ రాష్ట్రపతి అయ్యారు. ద్రౌపది ముర్ము భర్త పేరు శ్యామ్ చరణ్ ముర్ము. ముర్ము దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. టీచర్ గా జీవితం మొదలుపెట్టిన ద్రౌపది ముర్ము... తర్వాత బీజేపీలో చేరి వివాదాలు లేని నాయకురాలిగా గుర్తింపు పొందారు. ద్రౌపది ముర్ము 1979లో భువనేశ్వర్ లోని రమాదేవి విమెన్స్ కాలేజీ నుంచి బీఏ పాస్ అయ్యారు. ఆ తర్వాత ఒడిశా ప్రభుత్వంలో క్లర్క్ గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. నీటిపారుదల, ఇంధన శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు. తరువాతి కాలంలో తనకున్న ఆసక్తితో ఆమె టీచర్ అయ్యారు. రాయరంగ్ పూర్ లోని శ్రీ అరబిందో ఇంటిగ్రల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ లో గౌరవ ఉపాధ్యాయురాలిగా పని చేశారు. అ997లో ద్రౌపది ముర్ము తన పొలిటికల్ కెరీర్ ని మొదలుపెట్టారు. మొదట రాయరంగ్ పూర్ నగర పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి కౌన్సిలర్ గా గెలుపొందారు. నగర పంచాయతీ ఉపాధ్యక్షురాలిగా కూడా ఉన్నారు. ఆ తర్వాత రాయరంగ్ పూర్ అసెంబ్లీ స్థానం నుంచి 2000, 2009 ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచారు. మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు 2000 నుంచి 2004 వరకు నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ, -బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో వాణిజ్యం, రవాణా, మత్స్య, జంతు వనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మంత్రిగా ఉండి కూడా ఆమె నిరాడంబర జీవితాన్ని గడిపారు. ఆమెకు సొంత వాహనం కూడా లేదు. అందుకే ఒడిశాలోని ఉత్తమ ఎమ్మెల్యేలకు అందించే నీలకంఠ అవార్డును ముర్ము అందుకున్నారు. రెండుసార్లు బీజేపీ ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ముర్ము వ్యవహరించారు. 2002 నుంచి 2009 వరకు, 2013 నుంచి 2015 ఏప్రిల్ వరకు ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గంలోనూ సభ్యురాలిగా ఉన్నారు. ఆ తర్వాత ముర్మును జార్ఖండ్ గవర్నర్ గా నామినేట్ చేశారు. దీంతో క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. 2015 మే 18న ఝార్ఖండ్‌కు తొలి మహిళ, గిరిజన గవర్నర్ గా ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేశారు. ఐదేళ్ల పదవీ కాలం ముగిశాక కూడా ఆమె అక్కడ గవర్నర్ గా కొనసాగారు. గవర్నర్ గా బాధ్యతలు తీసుకున్నాక కూడా వివాదరహితురాలిగానే ముర్ము కొనసాగారు. ప్రజా సంక్షేమమే ఎజెండాగా ముందుకు కదిలారు. గతంలో ఆమె బీజేపీ నేతగా ఉన్నా.. జార్ఖండ్ గవర్నర్ గా ఉన్నప్పుడు బీజేపీ సర్కారు తెచ్చిన బిల్లుల్లో కొన్నింటిని వెనక్కి పంపారు. ఆదివాసీల భూములను కాపాడేందుకు బ్రిటిష్ పాలనలో తీసుకొచ్చిన చోటానాగ్ పూర్ కౌలుదారీ చట్టం, సంతాల్ పరగణా కౌలు చట్టంలోని కొన్ని నిబంధనలను సవరించాలని 2017లో అప్పటి రఘువర్ దాస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రతిపక్షాలు వ్యతిరేకించినా.. అసెంబ్లీలో ఆమోదం పొందింది. అయితే ఆమోదం కోసం రాజ్ భవన్ కు ఫైలు వెళ్లిన తర్వాత గవర్నర్ గా ఉన్న ద్రౌపది ముర్ము ఈ బిల్లుపై సంతకం చేయకుండా వెనక్కు పంపారు. దీనివల్ల ఆదివాసీలకు ఏం లాభమని ప్రశ్నించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం సరైన జవాబు చెప్పలేకపోయింది. దాంతో ఆ బిల్లు ముందుకు సాగలేదు. దీనిపై విమర్శలు వచ్చినా ముర్ము వెనక్కి తగ్గలేదు. సవరణ బిల్లుపై 200 అభ్యంతరాలు ఉన్నాయని చెప్పారు. వాటిపై క్లారిటీ ఇవ్వాలని జార్ఖండ్ ప్రభుత్వానికి చెప్పారు. ఢిల్లీ స్థాయిలో ఒత్తిళ్లు వచ్చినా ఈ బిల్లు విషయంలో ఆమె వెనకడుగు వేయలేదు. తాను తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నారు. తర్వాత మరో అంశంలోనూ ఇదే విధంగా జరిగింది. రఘువర్ దాస్ ప్రభుత్వం హయాంలో పాతాళగడి వివాదం చెలరేగింది. అప్పుడు, ద్రౌపది ముర్ము ఆదివాసి గ్రామపెద్దలను, మాంకి, ముండాలను రాజ్ భవన్ కు పిలిపించి, వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించారు. 2019 డిసెంబర్‌లో రఘువర్ దాస్ ప్రభుత్వం కూలిపోయి జేఎంఎం నాయకుడు హేమంత్ సోరెన్ ఝార్ఖండ్ ముఖ్యమంత్రి అయ్యారు. కొన్ని నెలలకు హేమంత్ సోరెన్ ప్రభుత్వం ట్రైబల్ కన్సల్టేటివ్ కమిటీ (టీఏసీ ) ఏర్పాటుకు సంబంధించిన సవరణ బిల్లును గవర్నర్ ఆమోదం కోసం పంపింది. ఈ సవరణ ప్రకారం టీఏసీ ఏర్పాటులో గవర్నర్ పాత్ర ఉండదు. అయితే.. ద్రౌపది ముర్ము దానిపై సంతకం చేయకుండా ప్రభుత్వానికి తిరిగి పంపారు. ద్రౌపది ముర్ము గవర్నర్ గా ఉన్నప్పుడు విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. స్కూళ్లు, కాలేజీల పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేసేవారు. 2016లో యూనివర్శిటీల కోసం లోక్ అదాలత్ నిర్వహించారు. తీవ్ర వ్యతిరేకత వచ్చినా ఛాన్సలర్ పోర్టల్ ప్రారంభించారు. యూనివర్శిటీలకు సంబంధించిన అన్ని పక్రియలను దీనికి అనుసంధానించారు. యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లతో చర్చిస్తూ.. గిరిజన భాషల అధ్యయనానికి సంబంధించిన సూచనలు చేశారు. యూనివర్శిటీల్లో చాలా కాలంగా మూతపడిన గిరిజన, ప్రాంతీయ భాషల ఉపాధ్యాయుల నియామకం గవర్నర్ చర్యల ఫలితంగా మళ్లీ మొదలైంది.

# మహిళా స్వయం సమృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**హైదరాబాద్, జూలై 21 (సమ సమాజం):** తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహిళల స్వయం సమృద్ధికి ఎప్పుడూ లేనంతగా కృషి జరుగుతున్నదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా ఆయా సంఘాల మహిళలకు, ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందించే కార్యక్రమంలో భాగంగా.. శిక్షణ పూర్తి చేసుకున్న బ్యాంకింగ్ సఖిలకు డివైస్ పంపిణీ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..ప్రజల సేవల కోసమే మహిళా స్వయం సంఘాలకు శిక్షణ ఇచ్చి, బ్యాంకు సఖీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గతంలో 2 లేదా 3 కోట్లు రుణాలు దొరికేవి కావు. ఇవ్వాళ రూ. 18 వేల కోట్లు రుణాలు అందుతున్నాయని తెలిపారు. మహిళలు నమ్మకానికి నిదర్శనం. మహిళల్లో చైతన్యం, పట్టుదల పెరిగింది. ఆర్థికంగా బాగా బలపడ్డారని మంత్రి తెలపారు.గ్రామాలకు మంచినీటి సదుపాయాలు కలిగాయి. మహిళలు రోడ్ల మీదకు నీటికోసం రావడం తగ్గిపోయిందన్నారు. గతంలో గ్రామాలకు వెళ్లాలంటే భయం కలిగేది. ఇప్పుడు గ్రామాల్లో కరెంటు, మంచినీరు, సాగు నీరు, పరిశుభ్రమైన పల్లెలు దర్శన మిస్తున్నాయి. పట్టణాలు, నగరాల నుండి గ్రామాలకు ప్రజలు వలస వెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. భవిష్యత్తులో బ్యాంకు సఖిల ప్రాధాన్యం పెరుగుతుందని, ఓపికగా పని చేయండి...అభివృద్ధిని సాధించాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో నాబార్డు జి.ఎం. సెల్వం, ఎస్.బి.ఐ డి.జి.ఎం. నటరాజన్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ రాజ కిషోర్, సెర్ప్ బ్యాంకు లింకేజీ డైరెక్టర్ వై.ఎన్.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కెసిర్‌కు బిజెపి ఫీవర్ పట్టుకుంది

**సిద్దిపేట, జూలై 21 (సమ సమాజం):** ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎలక్షన్ ఫీవర్ కాదని, బీజేపీ ఫీవర్ పట్టుకుందని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ప్రజల బాధలు పోవాలంటే..బీజేపీ అధికారంలోకి రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు.ఉద్యోగులకు ఠంచన్ గా జీతాలు రావాలన్నా.. అభివృద్ధి జరగాలన్నా బీజేపీతోనే సాధ్యమన్నారు. తెలంగాణ కల్వకుంట్ల జాగీరా..పదవులన్నీ కేసీఆర్ కుటుంబానికేనా అని ప్రశ్నించారు. దేశ్ కీ నేత..దిన్ బర్ పీతా..ఫాంహౌజ్ మే సోతా..అమాస పున్నానికి ఆతా అంటూ ఎద్దేవా చేశారు. అగడుగునా అవమానించినా అల్లుడికి సిగ్గులేదని..నోటి నిండా అబద్దాలే వల్లిస్తున్నాడంటూ హరీష్ రావుపై మండిపడ్డారు. క్లౌడ్ బరస్ట్ తో అంతర్జాతీయ జోకర్ గా కేసీఆర్ మారాడని విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ ఆస్తులు కొల్లగొట్టిన వారికి మద్దతుగా ఆందోళనలు చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం కేసీఆర్ కు ఈడీ విచారణ తప్పదని వ్యాఖ్యానించారు. గురువారం సిద్ధిపేటలో ప్రజల గోస.. బీజేపీ భరోసా యాత్రలో మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం వర్షంలో తడిసి మొలకెత్తడానికి, నష్టం జరగడానికి పూర్తి బాధ్యత రాష్ట్రానిది, ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. రాష్ట్రంలో పండిన పంటను కాపాడలేని సీఎం.. రాష్ట్ర ప్రజలను ఎలా కాపాడతారని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వారికి భరోసా కల్పించడమే తమ ప్రజా సంగ్రామ యాత్రని బండి సంజయ్ అన్నారు. రాష్ట్రంలోని 5 జిల్లాలలో ప్రజా గోస - బీజేపీ భరోసా యాత్ర చేపట్టినట్లు బండి సంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 10 రోజుల పాటు మురళీధర్ రావు పాల్గొంటారని చెప్పారు. ప్రజలు వాస్తవ పరిస్థితులను చెప్పడానికే ఈ భరోసా యాత్ర చేపట్టామన్నా ఆయన..అక్టోబర్ 2 నుండి ప్రజా సంగ్రామ యాత్ర మొదలవుతుందని తెలిపారు. ఫాంహౌస్ పాలన చేసే సీఎం ఉండడం మన దౌర్భాగ్యామన్నారు. 30వేల కోట్ల ప్రాజెక్ట్ ను లక్షా 30వేల కోట్ల రూపాయలకు పెంచి ప్రజలు సొమ్మును దోచేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. నదులకు నడక నేర్పిన కేసీఆర్ నీళ్లలో మునిగిన మోటార్లకు ఈత నేర్పలేదా అని ప్రశ్నించారు. రైతుబంధు మాత్రమే ఇచ్చి దళితబంధు సహా అన్నింటిని ఆపేశారని బండి సంజయ్ ఆరోపించారు. పంటలకు మద్దతు ధర పెంచిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదే అని..మోడీ రాక ముందు1310 రూపాయలు ఉన్న మద్దతు ధర ఇప్పుడు 1960 ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి నదులకు నడక నేర్పారని మంత్రి కేటీఆర్ చెప్పుకుంటుండు.. మరి అదే ముఖ్యమంత్రి నీళ్లలో మునిగిన మోటార్లకు ఈత ఎందుకు నేర్పలేదు.? రాష్ట్రంలో కనీసం జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితులు రాష్ట్ర ప్రభుత్వం ఉంది. శ్రీలంకలో ఉన్నట్టు రాష్ట్రంలో పరిస్థితి ఉంది. కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ మధ్యప్రదేశ్ ఇంచార్జ్ మురళీధర్ రావు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, ప్రజలకు అండగా ఉండేందుకే ప్రజా గోస - బీజేపీ భరోసా అనే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో మార్పు కొరకే తమ పోరాటం అని స్పష్టం చేశారు. వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టులు కట్టి ప్రజాసొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రజాకార్ల సహకరించిన ఓవైసీ కుటుంబానికి కేసీఆర్ సహకరిస్తూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించకపోవడం సిగ్గుచేటన్నారు.

# దేశానికి విఘాతంగా మారిన మోడీ విధానాలు

**నల్లగొండ, జూలై 21 (సమ సమాజం):** తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మండిపడ్డారు. అప్రజాస్వామిక విధానాలతో దేశంలో అరాచకాన్ని సృష్టిస్తోందని అన్నారు. ఎఫ్ఆర్‌బీఎం ద్వారా తెలంగాణకు రావాల్సిన అప్పుల విషయంలోనూ కేంద్రం కుట్ర చేసిందని ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన గ్రాంట్లకు అడ్డుపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సమగ్రతకు ముప్పు తెచ్చేలా కేంద్రం విధానాలు ఉన్నాయని సుఖేందర్ రెడ్డి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... జాతీయ ఉపాధి హామీ పథకం పనులు బాగున్నాయని పార్లమెంట్‌లో కితాబు ఇచ్చినా రాష్ట్రంలో 16 బృందాలతో తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. కొర్రీలను పెడుతూ తెలంగాణలో ఉపాధి హామీ పథకాన్నీ రద్దుచేయాలని కేంద్రం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వంలో సామాన్య ప్రజలకు బతకడం కష్టంగా మారిందన్నారు. స్మశానవాటికలకు కూడా జీఎస్టీ పెడుతున్నారని... జీఎస్టీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కంటే ఎక్కువగా 100 లక్షల కోట్లు కేంద్రం అప్పు చేసినా రాష్ట్రంలో ఒక్క జాతీయ ప్రాజెక్టును ఇవ్వలేదని విమర్శించారు. సీబీఐ, ఈడీలతో బెదిరింపులకు గురి చేస్తూ బీజేపీదిగజారుడు రాజకీయాలు చేస్తోందని గుత్తాసుఖేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెడరల్ వ్యవస్థకి తూట్లు పొడుస్తూ.. ప్రజలను ఇబ్బందులు గురి చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకం అమలు విషయంలోనూ తెలంగాణపై కేంద్రం వివక్ష చూపెడుతోందని గుత్తా ఆరోపించారు. రాష్ట్రంలో ఉపాధి హామీ భేషుగ్గా ఉందని.. కానీ కేంద్రం కావాలని కొర్రీలు పెట్టి ఇబ్బందులు పెడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకాన్ని బంద్ చేయాలని కుట్ర చేస్తోందన్నారు. గ్యాస్ డీజిల్, పెట్రోలు ధరలను పెంచి.. నిత్యావసరాలపైనా జీఎస్టీ విధించి పైశాచికంగా వ్యవహరిస్తోందని కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మశాన వాటికలను కూడా జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం దుర్మార్గం. మోదీ ప్రభుత్వంలో ప్రజలు బతికేలా లేరు. కేంద్ర సర్కార్ ప్రజలను పీక్కు తింటోంది. 2014లో రూ.40 లక్షల కోట్లు ఉంటే.. ఇప్పుడు రూ.100 లక్షల కోట్లు అప్పులు చేసింది మోదీ సర్కార్. ఇది కేంద్రం ఘనకార్యం. ఈడీ, సీబీఐలను ఉసిగొల్పి మాట వినని ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ చేయడమే కేంద్రం పని. శివసేన పార్టీని నిర్వీర్యం చేసి.. ఫెడరల్ వ్యవస్థకు విఘాతం కలిగించింది. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోతోంది. దేశాన్ని తమ కబంధ హస్తాల్లోకి తెచ్చుకునేలా మోదీ పన్నాగం పన్నుతున్నారు. ప్రజల గురించి ఆయనకు ఆలోచనే లేదు. నిత్యావసరాలపై జీఎస్టీ పెంచడం బాధాకరమని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ పాలనలో సామాన్యులు బతకడం చాలా కష్టంగా మారిందని విమర్శించారు. ఒకపక్క వర్షాలు, మరోవైపు నిత్యావసరాల ధరలతో పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దేశ సమగ్రతకు మంచిది కాదని సూచించారు. పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతోపాటు పాలు, పెరుగు, చివరకు స్మశాన వాటికలు కూడా వదలకుండా జీఎస్టీ వేశారన్ని ÷రైయ్యారు. పేదల బతుకు దుర్భరంగా ఉందని చెప్పారు. పెరిగిన ధరలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యిందని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించి నూతన జీఎస్టీ విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

## వీఆర్ఎస్ఐల నిరసనకు బీజేపీ సంఘీభావం ప్రకటించిన బీజేపీ

**మెదక్, జూలై 21 (సమ సమాజం):** వీఆర్ఎల నిరసనకు బీజేపీ సంఘీభావం నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు వీఆర్ఎల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. గురువారం మెదక్ జిల్లా కలెక్టరేట్ వద్ద వీఆర్ఎల నిరసన కార్యక్రమానికి బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించి వారికి మద్దతుగా నిరసన కార్యక్రమంలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెసిడెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ వీఆర్ఎలతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ వారి ఉద్యోగాలకు భద్రత లేకుండా ప్రభుత్వం చేసిందని దుయ్యబట్టారు. ఈ విషయంలో బీజేపీ వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రెటరీ నల్లాల విజయ్ కుమార్, మెదక్ టౌన్ ప్రెసిడెంట్ నాయిని ప్రసాద్, మధు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని ఎండోమెంట్లో కలపాలని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మెదక్ సంగారెడ్డికి వినతి పత్రం అందజేసిన పలువురు నాయకులు

**అల్లాదుర్గం, జూలై 21 (సమ సమాజం):** ఉమ్మడి మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం అల్లాదుర్గం మండల పరిధిలోని ప్రసిద్ధి చెందిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని దేవాదాయ శాఖలో కలపాలని బుధవారం నాడు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో అల్లాదుర్గం అసెంబ్లీ సాధన సమితి అధ్యక్షులు కే బ్రహ్మం, సామాజిక హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నక్క సూర్యకుమార్, మాజీ సర్పంచ్ రాణి నర్సింలు, మరియు సోమవంశ సంఘం, కోశాధికారి పట్కరి శంకర్, అల్లాదుర్గం సిటిజన్ క్లబ్ కార్యదర్శి జగదీశ్వర్, అల్లాదుర్గం యువజన సంఘాల నాయకులు మరియు గ్రామ ప్రజలు పి. మదు, నరేందర్ రెడ్డి, బత్తుల సురేష్, కొమ్మ సంతోష్, పాండు, మహేష్, నాగిశెట్టి, లింగం, దత్తు, సాయిలు, ఆంజనేయులు, సదానందం, అఖిల్, బొయిని ఈశ్వర్. గోపాల్,చిన్న,రాజు పాల్గొన్నారు.

## అసత్యపు ఆరోపణలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

### : తస్లీమా అక్క అభిమాన సంఘాలు

**ములుగు, జూలై 21 (సమ సమాజం):** వెంకటాపూర్ మండల కేంద్రంలో నిరాధారమైన వ్యాఖ్యలు ప్రసారం చేస్తూ అసత్యపు ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని తస్లీమా అక్క అభిమాన సంఘాల సభ్యులు కోరారు ములుగు సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పై అర్థరహిత వ్యాఖ్యలు చేసిన న్యూస్ యుట్యూబ్ ఛానల్ రిపోర్టర్ చిలుక ప్రవీణ్ మొగుళ్ళ భద్రయ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ లో ఎస్సై కి పైటిషన్ ఇచ్చినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు అనంతరం తస్లీమా అక్క అభిమాన సంఘాల సభ్యులు మాట్లాడుతూ ఎంతో మంది అనాధ అభాగ్యుల ఆకలిని తీరుస్తూ నేటి సమాజానికి ఆదర్శ ఆఫీసర్ గా నేటి తరం మరో మదర్ థెరిస్సాలా వెలుగొందుతున్న తస్లీమాపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరైనది కాదని మీ చానల్స్ రేటింగ్ కోసం సమాజంలో గొప్ప పేరు ఉన్నవాళ్ళపై అసత్యపు ఆరోపణలు చేస్తే ప్రజల చేతుల్లో శిక్ష తప్పదని వారు అన్నారు మొగుళ్ళ భద్రయ్య అనే వ్యక్తి చిలుక ప్రవీణ్ కు తప్పుడు సమాచారం ఇచ్చి నిరాధారమైన వ్యాఖ్యలు ప్రసారం చేసిన ప్రవీణ్ భద్రయ్య లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు ఇట్టి తప్పుడు ఆరోపణలు చేసిన వారు బహిరంగ క్షేమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు తస్లీమా అక్క అభిమాన సంఘాల సభ్యులు మామిడిపెల్లి రమేష్ లావు లావుడ్య సుభ్రాం బోల్లవెని రాజ్ కుమార్ చంటి అనిల్ ప్రవీణ్ వివేక్ సిద్దు చరణ్ తదితరులు ఉన్నారు


## వరద బాధితుల కుటుంబాల పరామర్శకు రానున్న వైఎస్ షర్మిల

### రామసహాయం శ్రీనివాస్ రెడ్డి వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు

**ములుగు, జూలై 21 (సమ సమాజం):** ములుగు జిల్లా 21 గురువారం జిల్లా కేంద్రంలోని ఇటీవల భారీ వర్షాలతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించ డానికి వైయస్ఆర్ తెలంగాణ పార్టీ అధినాయకురాలు వైయస్ షర్మిలమ్మ రేపు ఏటునాగారం కి చేరుకొని వరద బాధితులను పరామర్శిస్తారని వైయస్సార్ తెలంగాణ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు రామ సహాయం శ్రీనివాసరెడ్డి తెలిపారు ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వైయస్ షర్మిల నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి భరోసా కల్పించే ప్రయత్నం చేస్తారని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అన్న తిరుపతి ములుగు మండల అధ్యక్షుడు కొండ బోయిన దిలీప్ వెంకటాపురం మండల అధ్యక్షుడు బల్ల ప్రతాప్ పూనెం సాయి తేజ్,గణేష్,తదితరులు పాల్గొన్నారు

# కళ తప్పిన జోగిపేట చే"నేత"ను ఆదుకోరా...!






**అందోల్, జూలై 21 (సమ సమాజం):** కూడు, గూడు, గుడ్డ మానవాళికి ఎంతో ముఖ్యమైనవి. కూడు, గూడు లేకున్నా ఎలాగోలా కాలం గడపొచ్చు. అదే గుడ్డ లేకపోతే ఉండగలమా అనేది గుడ్డ లేనప్పుడు దాని విలువ తెలుస్తుంది. ఇదంతా ఎందుకో చెప్పట్లేదండోయ్. బట్టలు నేసే నేతన్నలకి పని లేక పరిశ్రమకి కష్టం వచ్చింది. ఏడు దశాబ్దాలుగా కళకళలాడిన జోగిపేట చేనేత సహకార సంఘం గత ఆరేళ్లుగా దివాలా తీస్తూ అప్పుల ఊబిలో చిక్కుకొని మగ్గాల చప్పుళ్ళు కార్మికులు లేక ఆ సంఘం మూగబోయింది. చేనేతను ఆదుకుంటామని చెబుతున్నా మంత్రి కేటీఆర్ కి ఒక్క సిరిసిల్ల చేనేత సహకార సంఘమే గుర్తొస్తుందా. ఈ జోగిపేట సంఘం గుర్తుందో లేదో. గుర్తుంటే జోగిపేట సంఘంపై ప్రత్యేక చొరవ తీసుకుని అప్పుల ఊబిలో నుండి బయట పడేసి జీవనోపాధి కల్పించాలంటున్న కార్మికులు, యాజమాన్యం, కుల పెద్దలు. సంగారెడ్డి జిల్లా జోగిపేట చేనేత సహకార సంఘం ప్రాముఖ్యతను సంతరించుకుంది. జోగిపేట ప్రాంతంలోని చేనేత కార్మికులకు చేతినిండా పని, కడుపునిండా తిండి పెట్టిన ఈ చేనేత సంఘం నేడు కార్మికులు లేక అప్పుల బాధతో ఆకార్మికులకు ఉపాధిని ఇచ్చింది. అంచెలంచెలుగా ఎదుగుతూ ఆంధ్రప్రదేశ్ లోనే ప్రథమ స్థానంలో నిలిచి 4సార్లు అవార్డులు అందుకున్న ఘనత ఈ సంఘంకు ఉంది. ఇప్పటికైనా సంఘాన్ని ప్రభుత్వం పట్టించుకోని చేనేత కార్మికుల బ్రతుకులకు దారి చూపాలని కార్మికులు కోరుతున్నారు. చేనేత సహకార సంఘం జోగిపేట డిసిసిబి బ్యాంకు కి 35 లక్షల రూపాయలు బకాయి ఉండడంతో బ్యాంక్ అధికారులు డిసెంబర్ 22-2020వ తేదీన సంఘం ఆస్తులను వేలం వేసేందుకు నోటీస్ బోర్డు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మంత్రి హరీష్ రావుదృష్టికి తీసుకువెళ్లి బ్యాంకు అధికారులతో మాట్లాడి డబ్బులు చెల్లించేందుకు సమయం కావాలని, డబ్బులు చెల్లించేందుకు బ్యాంకువారు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మంత్రి హరీష్ రావు ల సూచనల మేరకు కు వేలం నకు సంబం ధించిన ఉత్తర్వులను రద్దు చేసి బ్యానర్ తొలగిం చినట్లు బ్యాంకు అధికారులు చెబుతు న్నారు. కార్మికులను వివరణ కోరగా. మల్లమ్మ అనే మహిళ మాట్లాడుతూ. ఎన్నో ఏళ్లుగా జోగిపేట చేనేత సహకారం సంఘంలో నేను మా ఆయన ఇద్దరం పనిచేశాం. ఒక్క రూపాయి నుండి టవల్స్ లుంగీలు నేస్తే 50 నుండి 70 రూపాయలు మాత్రమే వచ్చేవి. ఆపో్క నుండి ధరలు పెరిగాక చూస్తే రోజుకు 150 నుంచి 200 రూపాయల పని మాత్రమే చేసుకునే వాళ్ళం. ఇప్పుడా పని లేదు చేతిలో చిల్లి గవ్వలేక దొరికిన పని ఇంట్లో జొన్న రొట్టెలు చేస్తూ రోజులు గడుపుతున్న పరిస్థితి. ప్రభుత్వం దయతలిచి జోగిపేట సంఘానికి పూర్వం వైభవం తీసుకురావాలంటున్నారు. సంఘం అధ్యక్షులు వర్కల అశోక్ ని వివరణ కోరగా. నేను ఒక కార్మికుడి బిడ్డనై ఎన్నో ఏళ్ళుగా కళకళలాడిన ఈ సంఘం నేడు మూతపడి ఉండడం పట్ల మనసు బాదేస్తుంది. ఈ పని వైపు ఈతరం నిరుద్యోగ యువత మొగ్గు చూపుకపోవడం, గతంలో నుండి పనిచేస్తున్న కార్మికులు ధర గిట్టుబాటు కాక మానేయడం ఒక కారణం కాగా బ్యాంకులో పేరుకుపోయిన అప్పులు మరో కారణం. ప్రభుత్వం స్పందించి నూతన టెక్నాలజీ హంగులతో కూడిన మిషన్ మగ్గాలను ఈ సంఘములో ఏర్పాటు చేస్తే ధర గిట్టుబాటు అవుతాది. సంఘానికి పూర్వ వైభవం వస్తదని కోరుతున్నారు.

## విఆర్ఏల రిలే నిరాహార దీక్షలు

**రాయికోడ్, జూలై 21 (సమ సమాజం):** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విఆర్ఎ లందరికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో చాలా సార్లు అసెంబ్లీ సాక్షిగా అందరికి పేస్కెల్ అమాలు చేస్తామని ప్రకటించి, నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోకపోవడంతో, ఇంతకుముందు చాలాసార్లు అధికారులకు తమ సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో రాష్ట్ర విఆర్ఎ ల జేఏసీ పిలుపు మేరకు రాయికోడ్ మండలానికి చెందిన విఆర్ఎ లు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో గత రెండు రోజుల నుండి రిలే నిరాహారదీక్షలు చేయడం జరుగుతుంది. విఆర్ఎల సంగారెడ్డి జేఏసీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం పేస్కెల్ జీవో ను వెంటనే విడుదల చేయాలని, విఆర్ఎల సమస్యల పట్ల సిసిఎల్ఎ నిర్లక్ష్య వైఖరి నశించాలని, అర్హత కలిగిన విఆర్ఎలందరికి ప్రమోషన్స్ ఇచ్చి, 55సం,, లు పైబడిన వారి వారసులకు ఉద్యోగాలు ఇచ్చి, విఆర్ఎలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు, తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు విఆర్ఎలందరం రిలే నిరాహార దీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, విఆర్ఎ ల సంఘం రాయికోడ్ మండలాధ్యక్షుడు జిపి రత్నం, ఉపాధ్యక్షుడు శివకుమార్, సలహాదారు గోపాల్, కార్యదర్శులు ఎన్ . శ్రీశైలం, జె. వీరేందర్, అశోక్, విఠల్, ఎ. నర్సింలు, నయిం, సదక్ అలీ, ఇస్మాయిల్ మరియు మహిళల విఆర్ఎలు తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సమీక్ష



**అందోల్, జూలై 21 (సమ సమాజం):** వానాకాలం సాగుకు సింగూరు నుంచి నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆదేశించారు. బుధవారం అందోల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ. ఇప్పటికే సింగూర్ కాల్వల ద్వారా అన్ని చెరువులను నింపామన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరిందని ఆయన తెలిపారు. నీటిని రైతులు పంట పొలాల్లోకి మళ్లించే పనులను త్వరగా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ రమాదేవి, సింగూరు డిప్యూటీ ఈఈ నాగరాజు, ఏఈ మాజర్, మైపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.







## అప్పుడే పదిహేడేళ్లు పూర్తయ్యాయా

### అనుష్క సినీ ఎంట్రీకి గుర్తుగా కెక్ కట్



సాటిలేని అందం. అభినయంలో ఆమె మేటి. ఎలాంటి పాత్రలోకైనా ఇట్టే ఒదిగిపోయే టాలెంట్ ఆమె సొంతం. పేరు అనుష్క శెట్టి. అగ్రకథానాయకులు ఆమెతో నటిస్తే ఆ సినిమాకే నిండుదనం. తెర గ్లామర్‌తో కళకళలాడుతుంది. టాలీవుడ్‌లో ఆమె కథానాయికగా అడుగుపెట్టి అప్పుడే పదిహేడేళ్ళయిపోయింది. 2005లో వచ్చిన నాగార్జున 'సూపర్' చిత్రంతో అనుష్క కథానాయికగా ఎంట్రీ ఇచ్చింది. తొలి చిత్రంతోనే తన అందానికి, అభినయానికి మంచి మార్కులేయించుకుంది. అక్కడ నుంచి ఆమె వెనుదిరిగి చూడలేదు. ఇప్పటికీ దక్షిణాదిన అనుష్క శెట్టి క్రేజీ హీరోయిన్. ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ మూవీస్‌పైనే తన దృష్టినంతటినీ పెట్టిన ఆమె ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి హీరోగా యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో ఒక సినిమాలో నటిస్తోంది. అనుష్క పదిహేడేళ్ల టాలీవుడ్ జెర్నీని పురస్కరించుకొని.. యూవీ క్రియేషన్స్ వారు షూటింగ్ గ్యాప్‌లో చిత్ర యూనిట్‌తో కలిసి కేక్ కటింగ్ కార్యక్రమాన్ని జరిపారు. కేక్ పై '17 ఇయర్స్ అనుష్క ఇక్కడ'.. అని రాయించారు. హీరో నవీన్ పోలిశెట్టి ఆ ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి.. తనదైన శైలిలో ఒక వ్యాఖ్యను కూడా జతచేశాడు. 'అనుష్కశెట్టికి కేక్ ను లంచంగా ఇచ్చాం. ఈ పదిహేడేళ్ళలో నేనే బెస్ట్ కో స్టారట మహేశ్. అద్భుతమైన ఆమె సినీ జెర్నీకి అభినందనలు. మా సినిమా షూటింగ్ జరుగుతోంది. అందులో పిచ్చ కామెడీ ఉంటుంది. మళ్ళీ యూవీ వారు రూటర్ ఆఫ్ చేసే లోపల అప్డేట్ ఇచ్చేశా.'. అంటూ నవీన్ ట్వీట్ చేశాడు. ఇంకా యూవీ క్రియేషన్స్ వారు అనుష్కకి అభినందనలు తెలిపారు. 'మిసెస్ శెట్టి.. మిస్టర్ పోలిశెట్టి' అనే టైటిల్‌ను ఈ సినిమా కోసం రిజిస్టర్ చేశారు. తనకన్నా తక్కువ వయసులో ఉన్న కుర్రాడితో ఒక స్త్రీ ప్రేమలో పడడం ఈ సినిమా కథాంశం. కామెడీతో పాటు ప్రేక్షకుల్ని కదిలించే ఎమోషన్స్ కూడా ఉన్నాయి ఇందులో. మహేశ్ పీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మంచి అంచనాలున్నాయి. రెండేళ్ళ క్రితం ఓటీటీలో విడుదలైన 'నిశ్శబ్దం' (ఔతిబరజీశిటజీప) అనుష్క ఆఖరు సారిగా తెరపై కనిపించిన చిత్రం. దీని తర్వాత అనుష్క నటిస్తున్న చిత్రం ఇదే కావడంతో మరింతగా హైపు క్రియేట్ అయింది. ఆమె సరసన ఈ సినిమాలో నవీన్ పోలిశెట్టి హీరోగా నటించడమే ఈ సినిమా ప్రత్యేకతగా చెప్పుకోవాలి. 'జాతిరత్నాలు' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న నవీన్ పోలిశెట్టి ఇప్పుడు ఏకంగా అనుష్కశెట్టితోనే జోడీ కట్టడం విశేషంగా మారింది. మరి ఈ సినిమా ఈ ఇద్దరికీ ఏ స్థాయిలో పేరు తెస్తుందో చూడాలి.

## విజయవాడలో థాంక్యూ ప్రమోషన్

### కుటుంబ కథా చిత్రం అన్న మేకర్స్

థ్యాంక్యూ' సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిత్ర బృందం విజయవాడలో సందడి చేశారు. దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఈ సందర్భంగా గురువారం విజయవాడలో హీరో నాగచైతన్య, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, దర్శకుడు విక్రమ్ కుమార్, రచయిత బీవీఎస్ రవి మీడియాతో ఇంటరాక్ట్ అయ్యారు. నాకు కుటుంబ కథా చిత్రాలంటే చాలా ఇష్టం. అభిమానుల కోసం ప్రతిసారీ కొత్తగా ట్రై చేయాలనుంటుంది. అలా చేసిందే ఈ సినిమా. అభిరామ్, ప్రియా అనే పాత్రలు సినిమాను నడిపిస్తాయి. మన జీవితంలో ఎవరెవరికో థ్యాంక్యూ చెప్పాలని చెప్పలేకపోతున్నాం. ఈ సినిమా చూశాక కచ్చితంగా వారిని గుర్తు చేసుకొని థ్యాంక్స్ చెబుతాం. ఈ చిత్రం నన్ను చాలా మార్చింది. వ్యక్తిగతంగానూ చాలా మారాను. ఒకప్పుడు నా మనసులో భావాల్ని లోపలే దాచేకునేవాడిని ఇప్పుడు బయటకు చెప్పగలుగుతున్నా అని నాచైతన్య అన్నారు. ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు ప్రేక్షకలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 'మనం' చిత్రం తర్వాత చైతూ, విక్రమ్ కె.కుమార్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ నెల 22న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in